క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం


అంగన్‌వాడీ కేంద్రానికి చేరిన పౌష్టికాహారం, బాలామృతం

గాండ్లపెంట: అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం సరఫరా అయింది. ఈ నెల 17న 'సాక్షి'లో 'అంగన్‌వాడీ కేంద్రాలకు అందని పౌష్టికాహారం' శీర్షికన కథనం వెలువడింది. స్పందించిన ఐసీడీఎస్ అధికారులు మండల వ్యాప్తంగా ఉన్న 62 కేంద్రాలకు రెండు రోజులుగా బాలామృతం ప్యాకెట్లు, రెండో విడత కోడిగుడ్లు సరఫరా చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

వెలిగిన వీధిదీపాలు


మరమ్మతుల అనంతరం వెలుగుతున్న వీధిదీపాలు

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని పలు వీధుల్లో వీధిదీపాలు వెలిగాయి. ఆయా వీధుల్లో 20 రోజులుగా వీధిదీపాలు వెలగక అంధకారం అలుముకుంది. ఈ విషయమై శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో 'కార్యదర్శి గారు.. సమస్య పరిష్కరించండి' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శులు రమేష్, ముబారక్ సర్పంచ్, సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్‌తో కలిసి పశువుల మంద వద్దనున్న ఎంసీబీ ని మరమ్మతు చేయించారు. పని చేయని వీధిదీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. వీధి దీపాలు వెలగడంతో కాలనీ వాసులు 'సాక్షి'తోపాటు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ ఆంజినమ్మ, శ్రీరాములు, సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లు వేణు, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాకు ప్రీమియం చెల్లించాలి

చెన్నేకొత్తపల్లి: 2024–25 రబీ సీజన్‌కు పంటల బీమా వర్తింపు కోసం ప్రభుత్వం నిర్దేశించిన ప్రీమియంను చెల్లించాలని మండల వ్యవసాయాధికారి ఉదయ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది రబీ నుంచి పంట రుణాలు తీసుకునే రైతులు తప్పనిసరిగా బ్యాంకుల ద్వారా ప్రీమియం కట్టాలని పేర్కొన్నారు. మిగిలిన రైతులు మీసేవా లేదా ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా ప్రీమియం చెల్లించాలన్నారు. రైతుల ఆధార్ కార్డు, 1బీ, పంటల సాగు ధ్రువీకరణ పత్రం, ఆధార్ లింక్ అయిన బ్యాంకు అకౌంట్, ఫోన్ నంబర్ తీసుకెళ్లాలన్నారు. వరి మినహా మిగిలిన అన్ని పంటలకు డిసెంబర్ 15 లోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు.

పాస్ రెన్యూవల్ కష్టాలు


పాస్ కౌంటర్ వద్ద పడిగాపులు కాస్తున్న విద్యార్థులు

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలో విద్యార్థుల పాస్ రెన్యూవల్ కష్టాలు వెంటాడుతున్నాయి. నాలుగు రోజులుగా విద్యార్థుల పాస్‌లు రెన్యూవల్ చేయకపోవడంతో మండలాల నుంచి వచ్చే విద్యార్థులు చార్జీలు పెట్టుకోవాల్సి వస్తోంది. ఈ విషయమై ఆర్టీసీ అధికారులను అడిగితే సర్వర్ స్లోగా నడుస్తోందని, అందుకే ఆలస్యమవుతోందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సకాలంలో పాస్ రెన్యూవల్ చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు


వర్షాలకు దెబ్బతిన్న రోడ్డుకు మట్టి వేయిస్తున్న గ్రామస్తులు

రామగిరి: ఇటీవల కురిసిన విస్తార వర్షాలకు మండలంలోని కుంటిమద్ది, పోలేపల్లి, అక్కంపల్లి, రామగిరి చెరువులు పూర్తిస్థాయిలో నిండి మరువపారాయి. ఈ క్రమంలో దిగువన ఉన్న గ్రామాలు పెనుబోలు, కలికివాండ్లపల్లి, గంతిమర్రి గ్రామాల రోడ్లు దెబ్బతిన్నాయి. నాలుగు, ఐదు రోజులుగా రాకపోకలు నిలిచిపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామంలోని యువకులు జయరామిరెడ్డి, శివారెడ్డి, చంద్రకిరణ్ రెడ్డి, భాస్కర్, లక్ష్మీనారాయణ రెడ్డి శుక్రవారం తమ సొంత నిధులతో రోడ్డు మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. తమ ట్రాక్టర్లతో దెబ్బతిన్న కల్వర్ట్ రోడ్డుకు మట్టిని తోలించారు. జేసీబీతో రోడ్డును చదును చేయించి రాకపోకలు పునరుద్ధరించారు.

రహదారి.. పక్కదారి!

- ఎన్‌హెచ్–342 నిర్మాణంలో లోపం
- బ్రిడ్జీలు, అండర్ పాస్‌లకు తిలోదకాలు
- గ్రామీణ ప్రయాణికులకు ఇబ్బందులు


బ్రిడ్జి ఏర్పాటు చేయాల్సిన అవసరమున్న కదిరి-పెనుకొండ ప్రధాన రోడ్డు


మూసివేసిన పెడపల్లి-పైపల్లి రోడ్డు

పుట్టపర్తి అర్బన్: జాతీయ రహదారి– 342 నిర్మాణం పక్కదారి పట్టింది. దీంతో హైవే పక్కనున్న గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పేలా కనిపించడం లేదు. ధర్మవరం, పుట్టపర్తి, పెనుకొండ నియోజకవర్గాలను అనుసంధానిస్తూ చేపట్టిన జాతీయరహదారి –342 నిర్మాణంలో పలు తప్పిదాలు జరిగాయి. హైవేకు అటు, ఇటు గ్రామాలు కలిసే చోట బ్రిడ్జి లేదా అండర్‌పాస్ ఏర్పాటు చేయకపోవడం.. మలుపులు తగ్గించకుండా వంకరగానే కొనసాగించడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మరికొన్ని చోట్ల దశాబ్దాల నాటి రోడ్లను మూసేయడంతో గ్రామీణులు కిలోమీటర్ల మేర చుట్టేసుకురావాల్సిన దుస్థితి నెలకొంది. మూడు నియోజకవర్గాల పరిధిలో సుమారు 84 కిలోమీటర్ల నేషనల్ హైవేను రెండు లేన్ల నుంచి నాలుగు లేన్లకు విస్తరిస్తూ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఇందులో ప్రధానంగా పుట్టపర్తి మండలం పెడపల్లి వద్ద కదిరి – పెనుకొండ ప్రధాన రహదారి ఉంది. ఈ రోడ్డుకు అటు, ఇటు పదుల సంఖ్యలో గ్రామాలు ఉన్నాయి. పుట్టపర్తి మండలంలో 15 గ్రామాల ప్రజలు ఈ మార్గం గుండానే రాకపోకలు సాగించాలి. కుడి, ఎడమ రెండు రోడ్లు కలిసే చోట ఎన్‌హెచ్ అధికారులు ట్రాఫిక్ – ప్రమాదాల నియంత్రణ కోసం బ్రిడ్జీలు కానీ, అండర్ పాస్‌లు కానీ నిర్మించలేదు. గ్రామీణ ప్రాంతాల నుంచి అటు, ఇటు వెళ్లే వాహనాలు ఎన్‌హెచ్‌పై వేగంగా దూసుకొచ్చే వాహనాల వల్ల ప్రమాదాలకు గురవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవే మలుపులు..

జాతీయ రహదారి–342 నిర్మాణ సమయంలో ఎత్తు పల్లాలను తగ్గించారు కానీ మలుపుల సంఖ్య తగ్గించలేకపోయారు. గతంలో ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారిలో ఉన్న ఒక్క మలుపు కూడా తగ్గలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మలుపులు లేకుండా రెండు కిలోమీటర్ల రోడ్డు ఎక్కడా లేదని వాహనదారులు పేర్కొంటున్నారు. డబుల్ రోడ్డును నాలుగు లేన్లుగా చేయడంతో వర్షపు నీరు వెళ్లే వంకలు ఇందులో కలిసి పోయాయి. దీంతో నీళ్ల రోడ్డు పక్కన పొలాల్లో పెద్ద ఎత్తున నిలిచిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇక పురాతనమైన పెడపల్లి – పైపల్లి రోడ్డు పూర్తిగా మూసేశారు. దీంతో ఇక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో నాలుగు కిలోమీటర్లు చుట్టుకుని రావాల్సి వస్తోంది. అటువైపుగా ఉన్న పొలాలకు సరైన దారి లేదని రైతులు పేర్కొంటున్నారు.

బ్రిడ్జీలు ఏర్పాటు చేయాలి



పుట్టపర్తి, పెడపల్లి నుంచి మా గ్రామాలకు వెళ్లాలంటే నేషనల్ హైవే దాటాల్సి ఉంది. దీంతో రెండు రోడ్లు కలిసే చోట తగ్గ ఉన్నందున తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అక్కడ బ్రిడ్జి నిర్మించాలని చాలా రోజుల నుంచి కోరుతున్నాం. సర్వే సమయంలో ప్రతిపాదించకపోవడంతో అక్కడ బ్రిడ్జి రాదని అధికారులు చెబుతున్నారు. పుట్టపర్తి మండలంలోనే 15 గ్రామాల ప్రజలు ఈ రోడ్డును దాటాల్సి ఉంది. ఇలాగే ప్రయాణిస్తే ప్రమాదాలకు అవకాశం లేకపోలేదు.

– చంద్రమోహన్‌రెడ్డి, మార్లపల్లి

రోడ్డు అభివృద్ధి చేయాలి



పూర్వం నుంచి ఉన్న రోడ్డును గత ప్రభుత్వంలో రూ. కోటి వెచ్చించి అభివృద్ధి చేశారు. ఈ రోడ్డుపైనే జాతీయ రహదారి–342 వెళ్తోంది. దీంతో పెడపల్లి–పైపల్లి రోడ్డు పూర్తిగా మూసేశారు. సుమారు 8 నెలల నుంచి ఇబ్బంది పడుతున్నాం. జాతీయ రహదారి పనులు అక్కడ పూర్తి చేశారు. వెంటనే ఈ రోడ్డును అభివృద్ధి చేయాలి.

– మురళి, పైపల్లి

ఎవరూ ఆందోళన చెందొద్దు

జాతీయ రహదారి – 342 వెళ్లే మార్గంలో వచ్చే ప్రతి గ్రామీణ రోడ్డు, ప్రధాన రోడ్లనూ రోడ్ సేఫ్టీ నిబంధనల మేరకే అభివృద్ధి చేస్తాం. పెనుకొండ–కదిరి రోడ్డుపై పెడపల్లి వద్ద బ్రిడ్జి రాదు. రోడ్ల అభివృద్ధి, రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా మార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. నేమ్ బోర్డులు ఏర్పాటు చేస్తాం. ప్రజలు ఎవరూ ఆందోళన చెందొద్దు.

– గిడ్డయ్య, డీఈఈ, జాతీయ రహదారి– 342

సమాచార హక్కు చట్టంపై అవగాహన


మాట్లాడుతున్న ఏడీఏ సత్యనారాయణ

నల్లచెరువు: ఎం అగ్రహారం రైతు సేవా కేంద్రంలో కదిరి ఏడీఏ సత్యనారాయణ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సిబ్బందికి సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ) పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టీఐ పట్ల ప్రతి అధికారి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సమాచార హక్కు చట్టం ప్రాధాన్యత, చట్టంలోని పలు అంశాలను సిబ్బందికి వివరించారు. సమాచార హక్కు చట్టం ద్వారా పౌరులు కోరిన సమాచారాన్ని 30 రోజుల్లోగా పై అధికారులు పరిశీలించి వారికి పూర్తి సమాచారం అందజేయాలన్నారు. ఏఓ భారతి, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

తాడిమర్రి ఎస్‌ఐగా కృష్ణవేణి



తాడిమర్రి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా ఎస్.కృష్ణవేణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ నాగస్వామి పుట్టపర్తికి బదిలీపై వెళ్లారు. గాండ్లపెంటలో పనిచేస్తున్న కృష్ణవేణి బదిలీపై ఇక్కడకి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించనని హెచ్చరించారు.

నేలకూలిన ప్రభుత్వ భవనం



చెన్నేకొత్తపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ కార్యాలయానికి సంబంధించిన భవనం గురువారం నేలకూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే ఈ భవన శిథిలాలు పడటంతో రాధమ్మకు చెందిన దుకాణం దెబ్బతింది. అందులో ఫ్రిజ్, కుట్టు మిషన్‌తో పాటు ఇతర సరుకులు పాడైపోయినట్లు ఆవేదన వ్యక్తం చేసింది. దుకాణం కోసం ఇటీవల డ్వాక్రా సంఘం నుంచి రూ.50 వేలు అప్పు తీసుకున్నట్లు తెలిపింది. అప్పు ఎలా తీర్చాలో దిక్కుతోచడం లేదని రాధమ్మ బాధపడుతోంది.

పశుగణన పక్కాగా చేపట్టండి


బత్తలపల్లిలో పోస్టర్లు విడుదల చేస్తున్న పశు వైద్యాధికారి గుర్నాథరెడ్డి, సిబ్బంది

బత్తలపల్లి: పశుగణనను పకడ్బందీగా చేపట్టాని పశు వైద్యాధికారి గుర్నాథరెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక పశువైద్యశాలలో పశు గణన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు దాదాపు నాలుగు నెలల పాటు గణన నిర్వహించాల్సి ఉంటుందన్నారు. మండలంలోని 13,204 ఇళ్లకు వెళ్లి పశుసంపద వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ప్రతి కుటుంబ యజమాని తమ ఆధార్, సెల్ నంబర్‌తోపాటు పశు సందప వివరాలను ఎన్యూమరేటర్స్‌కు అందజేయాలన్నారు. ఈ గణన పశుసంవర్ధక రంగంపై ఆధారపడిన కుటుంబాల జీవనోపాధికి తోడ్పడే కార్యక్రమాల రూపకల్పనకు ఉపకరిస్తుందన్నారు.

తనకల్లు: స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో శుక్రవారం పశుగణన బ్రోచర్లు, స్టిక్కర్లు, గోడ పత్రాలు, సూచన పుస్తకాలను పశుసంవర్ధక ఏడీ డాక్టర్ ఎం.కేశవయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 25 నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు దేశమంతటా కార్యక్రమం జరుగుతుందన్నారు. మండలంలోని పశు సంపద వివరాలను పక్కాగా సేకరించాలన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ పి.హరినాథ్‌రెడ్డి, లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఎస్.తహసీన్‌బాను, వెటర్నరీ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లిలో 'ప్రజా రెవెన్యూ దర్బార్'


భూ సమస్యలపై వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ప్రజా రెవెన్యూ దర్బార్ (భూ సమస్యల పరిష్కార వేదిక) నిర్వహించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఆర్డీఓ మహేష్, చెన్నేకొత్తపల్లి తహసీల్దార్ సురేష్ కుమార్ హాజరై రైతుల సమస్యలను తెలుసుకున్నారు. భూ సమస్యలకు వినతులను స్వీకరించారు. సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఎస్‌ఐ సత్యనారాయణ సిబ్బందితో బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

చెన్నేకొత్తపల్లి: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఇటీవల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులకు వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు శుక్రవారం ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఆర్డీఓ మహేష్, రామగిరి సీఐ శ్రీధర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సత్యనారాయణ, కేజీబీవీ ఎస్‌ఓ సువర్ణతో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాలపై మున్సిపల్ అధికారుల దాడులు


దుకాణంలో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

ధర్మవరం: పట్టణంలో శుక్రవారం మున్సిపల్ అధికారులు పలు దుకాణాలపై దాడులు నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్, అంజుమన్ సర్కిల్, కళాజ్యోతి సర్కిల్, కొత్తపేటలలో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, వస్తువులపై దాడులు నిర్వహించి 136 కిలోల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు అతిక్రమించిన దుకాణదారులకు రూ.21,500 జరిమానా విధించారు.

కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు


గాయపడిన కానిస్టేబుల్ ఉపేంద్ర

ధర్మవరం రూరల్: గొల్లపల్లి సమీపంలో శుక్రవారం బైక్‌ను కారు ఢీకొనడంతో ఓ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాలు.. కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ ఉపేంద్ర తన బావమరిదితో కలిసి బైక్‌పై అనంతపురం నుంచి చిగిచెర్ల మీదుగా ధర్మవరం బయలుదేరాడు. గొల్లపల్లి సమీపంలోకి రాగానే బైక్‌ను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు కాగా బావమరిది నాగేంద్ర స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఉపేంద్రను అనంతపురం తరలించారు.

రోగులకు భోజన ప్యాకెట్ల అందజేత


రోగులకు భోజన ప్యాకెట్లు అందిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం సత్యసాయి సేవా సమితి సభ్యులు దాదాపు 360 మంది రోగులకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు.గర్భిణులకు స్వీట్లు అందించారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ నామా ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ

ధర్మవరం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జేవీ రమణ మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనం అందించాలని, హెల్త్ అలవెన్స్ వర్తింపజేయాలన్నారు. ధర్మవరంలో ఈఎస్‌ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పై డిమాండ్ల సాధన కోసం ఈనెల28న మున్సిపల్ కార్యాలయం వద్ద తలపెట్టిన ఆందోళనలో కార్మికులు పాల్గొనాలని కోరారు. ఇంజినీరింగ్ కార్మికుల సంఘం నాయకులు బొగ్గు నాగరాజు, అనిల్, మహేష్, పెద్దన్న, దాసరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

తలుపుల: వేములగొంది కొట్టాల గ్రామం సమీపంలో శుక్రవారం బైకులు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. వైఎస్సార్ కడప జిల్లా చక్రాయపేట మండలం సిద్దారెడ్డిగారిపల్లికి చెందిన రామాంజులు బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన రామాంజులను బంధువులు కడప ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బాట్లమ్మ ఆలయంలో పూజలు


పూజలు అందుకున్న బాట్లమ్మ అమ్మవారు

తాడిమర్రి: దాడితోట గ్రామంలో వెలసిన బాట్లమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


సత్యసాయి అష్టోత్తర శత నామావళి


అష్టోత్తర శత నామావళిని జపిస్తున్న అనకాపల్లి భక్తులు

ప్రశాంతి నిలయం: అనకాపల్లి సత్యసాయి భక్తులు శుక్రవారం పర్తి యాత్రలో భాగంగా సత్యసాయి మహాసమాధి చెంత సత్యసాయి అష్టోత్తర శత నామావళిని నిర్వహించారు. పిదప సత్యాసాయిని కీర్తిస్తూ భక్తిగీతాలు ఆలపించారు. తర్వాత సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి


మాట్లాడుతున్న డీఎస్పీ విజయకుమార్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: పోలీసు అమరవీరులు త్యాగాలు మరువలేనివని డీఎస్పీ విజయకుమార్ పేర్కొన్నారు. అమరవీరులు సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా డీఎస్పీ కార్యాలయంలో పోలీసు విధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సంఘ విద్రోహశక్తుల ఆలకట్టించడంలో శాంతిభద్రతల పరిరక్షించడంలో పోలీసుల ప్రాత చాలా ఉందన్నారు. విధి నిర్వహణలో ఎంతో మంది పోలీసులు ప్రాణాలు అర్పించారన్నారు. అలాంటి వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.


నగదు బహుమతుల అందజేత

కదిరి అర్బన్: స్థానిక ఎస్‌డీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుక్రవారం నగదు బహుమతులు అందజేశారు. డీఎస్పీ శివనారాయణ స్వామి, సీఐ నారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ హాజరయ్యారు. వ్యాసరచనలో యశ్వంత్, ముబీనా, దుర్గాప్రసాదాచారి, వక్తృత్వపు పోటీల్లో సాఫియా, శేషాద్రి, ఝాన్సీ తొలి మూడు స్థానాల్లో నిలవగా వారికి వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వేయి చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం బీఏ, బీకాం, బీఎస్సీలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్ల గడువును ఈనెల 26 వరకు పొడిగించారు. ఈమేరకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో విడుదల చేశారు. గతంలో రిజిస్ట్రేషన్ చేయించుకోని విద్యార్థులు, రిజిస్ట్రేషన్ చేయించుకున్నా అనివార్య కారణాల వల్ల కళాశాలలో చేరకుండా ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికై నట్లు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని బాస్కెట్‌బాల్ కోర్టులో శుక్రవారం రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న అనంతపురం ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. అండర్–17 విభాగంలో ఉమ్మడి అనంతపురం బాస్కెట్‌బాల్ బాల,బాలికల జిల్లా జట్ల తరఫున పట్టణానికి చెందిన కిరణ్మయి, నిఖ్యశ్రీ, యశస్విని, లక్ష్మీనరసింహ, కార్తీక్‌నాయక్ ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వీరు ఈనెల 26 నుంచి 28 వరకు పశ్చిమ గోదావరి జిల్లా మార్టూరులో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్, బాలుర ఉన్నత పాఠశాల పీడీ నాగేంద్రలు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కనగానపల్లి: మండల పరిధిలోని తగరకుంట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని సబ్ ఇంజినీర్ జునైద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

స్థానిక సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనులు జరగనుండటంతో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఆపేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు, స్థానిక ప్రజలు ఈ విషయాన్ని గుర్తించుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తనకల్లు: ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో మృతి చెందాడు. ఎస్‌ఐ గోపి తెలిపిన వివరాలు..మారప్పగారిపల్లికి చెందిన వెంకటరమణ(38) వీధిలో ఎదురింటి వారితో గతంలో గొడవ పడ్డాడు. రెండు రోజుల క్రితం మరోమారు గొడవకు దిగారు. దీంతో మనస్తాపానికి గురైన వెంకటరమణ కిరోసిన్ పోసుకొని నిప్పు అంటించుకున్నాడు. గమనించిన స్థానికులు తీవ్ర గాయాలతో ఉన్న అతడిని చికిత్సకోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అతని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్లారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.